క్లుప్తంగా

రేషన్‌కార్డు ప్రొసీడింగ్స్ అందజేత



ధరూరు: మండల పరిధిలోని ర్యాలంపాడు గ్రామంలో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల ప్రొసీడింగ్స్‌ను మండల మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అందజేశారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యదర్శి విజయ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందించనున్నట్లు తెలిపారు. ఏళ్ల తరబడి రేషన్‌కార్డులు లేక ఇబ్బందులు పడిన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు అందజేయడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, తిమ్మప్ప, రంగారెడ్డి రాముడు, నర్సింహులు, రాజశేఖర్, లక్ష్మన్న, ఆర్‌ఐ రఘు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



అయిజ: పట్టణంలోని హోలియ దాసరి బుడుగజంగాల కాలనీలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని బుడుగ జంగాల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మారెప్ప కోరారు. బుధవారం సంఘం సభ్యులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మారెప్ప మాట్లాడారు. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, వెంటనే సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు.

ప్రమాదభరితంగా పాడుబడిన బావులు



మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లోని పాడుబడిన పురాతన బావులు ప్రమాదభరితంగా ఉన్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్కూరు, ఉలిగేపల్లి గ్రామాల్లో ఒకప్పుడు గ్రామస్తుల దాహార్తిని తీర్చిన బావులు నేడు నిరుపయోగంగా కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. ఇళ్ల మధ్యలో ఉండడంతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని తక్షణమే రక్షణ గోడలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం



ఇటిక్యాల: మండల పరిధిలోని గోపల్‌దిన్నె గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరై గ్రామపెద్దలకు, యువకులకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ మనోహర్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అతిగొప్ప వరం పౌర హక్కులని, వాటిని కాపాడి ప్రతి పౌరుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. న్యాయం, ధర్మం, స్వేచ్ఛ, అవకాశాలు, అభ్యున్నతి అనేవి కేవలం కొంత మంది, కొన్ని వర్గాలకు కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించేలా పౌర హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఇన్‌చార్జ్ రఘు, నాయకులు పాల్గొన్నారు.

ఫొటోలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

మానవపాడు: ఉపాధి హమీ కూలీలకు సంబంధించి పనులు వద్ద ఉదయం, మధ్యాహ్నం రెండు ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పీడీ శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో అలంపూర్, మానవపాడు, ఉండవెల్లి గ్రామాల టెక్నికల్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉపాధి కూలీల పర్యవేక్షణ చేయాలన్నారు. ఫొటోలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తేనే పని చేసిన వ్యక్తికి పూర్తిగా కూలి డబ్బులు అందుతాయని పేర్కొన్నారు.

కలగానే వంతెనల నిర్మాణాలు

- వర్షాకాలం ప్రారంభంతో తిప్పలు
- ఏళ్లు గడుస్తున్నా ప్రతిపాదనలకే పరిమితం
- గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు



మానవపాడు– అమరవాయి గ్రామాల మధ్యన పారుతున్న వాగు(ఫైల్)

మానవపాడు: ఏళ్లు గడుస్తున్నా వంతెనల నిర్మాణాలు ప్రారంభం కావడం లేదు. వాహనదారులు వర్షకాలం వచ్చిందంటే వాగులు దాటాలంటే నానా అవస్థలు పడుతున్నట్లు ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నట్లు మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా

అలంపూర్ నియోజకవర్గంలోని 7 మండలాల్లోని వర్షకాలంలో వాగులు దాటేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో వంతెనల నిర్మాణాల ప్రతిపాదనలు ప్రకటనలకే



చెన్నిపాడు- బొంకూరు మార్గంలో వాగుప్రాంతం

మాత్రమే పరిమితమయ్యాయి. కొన్ని అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మానవపాడు మండలంలోని మానవపాడు– అమరవాయి, చెన్నిపాడు– మానవపాడు, అమరవాయి– కలుకుంట్ల, ఇటిక్యాల మండలంలోని ఆర్. గార్లపాడు– కరుపాకుల, ససనూలు– షేక్‌పల్లి, షేక్‌పల్లి– ఎర్రవల్లి, ఇటిక్యాల– ఉదండాపురం వంతెన, ఉండవెల్లి మండలంలోని కలుగోట్ల– పుల్లూరు, ఉండవెల్లి– చిన్నఅముదాలపాడు, వడ్డేపల్లి మండలంలో జూలకల్లు– జూలకల్లుస్టేజి, రామాపురం–వల్లూరు, కొంకల– వడ్డేపల్లి, రాజోళి– ముండ్లదిన్నే, తుమ్మిల– మాన్‌దొడ్డి, అయిజ మండలంలో అయిజ– పరదాపురం, చిన్నతాండ్రాపాడు– అయిజ, అలంపూర్ మండలంలో అలంపూర్– గొందిమల్ల గ్రామాల్లో వంతెనల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. వర్షాకాలంలో వాగులు పారతుండటంతో గ్రామాల మధ్య రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

గ్రామాల్లో పొంగుతున్న వాగులపై వంతెనలు నిర్మించాలని ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వేళ కంటితుడుపు చర్యలుగా ఆదేశాలు జారీ చేస్తున్నారన్నారు. హామీలు ప్రకటనలకు మాత్రమే పరిమితమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సృజనను కలిసి వినతిపత్రం అందజేసి ఆవేదన తెలిపినట్లు మండల ప్రజలు పేర్కొంటున్నారు. వాగులు పొంగిన ప్రతిసారి ప్రయాణాలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు.

వంతెన నిర్మించాలి



అమరవాయి– మానవపాడు గ్రామాల మధ్య వాగుపై వంతెన లేక అవస్థలు పడుతున్నాం. వాగు వచ్చిందంటే కలుకుంట్ల, మద్దూరు, శాంతినగర్, చంద్రశేఖర్‌నగర్ గ్రామాలకు మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. అధికారులు, పాలకులు చొరవ చూపి వంతెన నిర్మించాలి.

- మల్లికార్జున్‌రెడ్డి, మానవపాడు

రాకపోకలు నిలిచిపోతాయి



మండలంలోని ఆర్.గార్లపాడు పెద్దవాగు వర్షకాలంలో ఉప్పొంగి పారుతుంది. దీంతో పదుల సంఖ్యలో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నాం. ఆర్. గార్లపాడు వాగుకు నిధులు మంజూరైన పిల్లర్ గుంతలు మాత్రమే తవ్వి వదిలేశారు.

- దండు బీసన్న, కారుపాకుల, ఇటిక్యాల

ప్రతిపాదనలు పంపాం

అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లోని అసంపూర్తిగా ఉన్న వంతెనలు నిర్మాణాలు పూర్తి చేయడానికి ప్రతిపాదనలు పంపాం. కొన్ని వంతనెల పనులు పూర్తి కానున్నాయి. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేస్తాం.

- మహేశ్వరి, ఏఈ అలంపూర్

సైబర్ మోసాలపై డీఎస్పీ అవగాహన

గట్టు: మండల పరిధిలోని చిన్నోనిపల్లె గ్రామాన్ని బుధవారం సాయంత్రం గద్వాల డీఎస్పీ మొగులయ్య సందర్శించారు. సైబర్ నేరాలు, లా అండ్ ఆర్డర్, డయిల్ 100, షీటీంపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల రక్షణ కోసం షీటీంలు పని చేస్తున్నాయని, తమ సమస్యలను మహిళలు షీటీంల దృష్టికి తీసుకురావాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయిల్ 100, సైబర్ మోసాలపై 1930ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గట్టు ఎస్‌ఐ మల్లేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలన



మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో ఇందిరమ్మ నిర్మాణ పనులను డీఈ నరేందర్ తనిఖీ చేశారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సంధ్యారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది



సాగునీటి సమస్యపై ఏఐసీసీ కార్యదర్శికి వివరిస్తున్న రైతులు

ఎర్రవల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లూరు సమీపంలో గల ఆర్డీఎస్ కాల్వను ఆయన స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీఎస్ కాల్వపై సాగు చేస్తున్న రైతులు కాల్వకు నీరు రాకపోవడంతో పంటలు ఎండుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన సంపత్‌కుమార్ ఫోన్‌లో ద్వారా సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే లిఫ్టు నుంచి నీటిని విడుదల చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు. అందులో భాగంగా రైతు రుణమాఫీ, రైతు భరోసా, సబ్సిడీ విత్తనాలు, పంటలకు గిట్టుబాటు ధర, సన్నవడ్లకు రూ.500 బోనస్, సబ్సిడీ పరికరాలు, యంత్రాలు వంటి వాటిని చేపట్టి రైతు ప్రభుత్వంగా పేరుగాంచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ కమిషన్ మెంబర్ సతీష్‌రెడ్డి, అలంపూర్ మార్కెట్‌యార్డు చైర్మన్ దొడ్డెప్ప, వైస్ చైర్మన్ కుమార్, మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నాయకులు లక్ష్మీ తీనారాయణరెడ్డి, జోగులరవి, నాగరాజు, విశ్వనాథ్‌రెడ్డి, రుక్మాందర్‌రెడ్డి, నీటి పారుదలశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

‘పల్లె దవాఖానాలపై పట్టింపు లేదు’



నిర్మాణం పూర్తికాని పల్లె దవాఖానా వద్ద బీజేపీ నాయకులు

రాజోళి: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో పల్లె దవాఖానాను ఎప్పుడు ప్రారంభిస్తారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ ప్రశ్నించారు. బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పైపాడులోని నిర్మాణం మధ్యలో నిలిచిన పల్లె దవాఖానాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. పల్లెలో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు నిర్మిస్తున్న దవాఖానాలపై పాలకులకు పట్టింపు లేదని, నిర్మాణం నిలిచిపోయినా, పనులు ఆలస్యంగా జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు సీజనల్ వ్యాధుల బారిన పడి ప్రైవేటు ఆస్పత్రుల పాలవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందించి దవాఖానా నిర్మాణం పూర్తి చేసి వైద్య సేవలు ప్రారంభించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్‌గౌడ్, మోహన్‌యాదవ్, శేఖర్ ఆచారి, ఈశ్వర్, సంజన్న, తిక్కయ్య తదిదరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంఈఓ భగీరథరెడ్డి

రాజోళి: బాలల హక్కులను పరిరక్షించడం అందరు బాధ్యతగా తీసుకోవాలని ఎంఈఓ భగీరథరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో బుధవారం రాజోళి, వడ్డేపల్లి మండలాల్లోని బాలల హక్కుల పరిరక్షణ సభ్యులకు ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలలను పనిలో పెట్టుకొని బాలకార్మికులుగా మార్చే వారిపై చట్టపరమైన చర్యలుంటాయని తెలిపారు. బాలలకు వారి హక్కులను పరిరక్షించుకునే చైతన్యాన్ని తెలియజేయాలన్నారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఉండేలా చూడటంతో పాటు, సౌకర్యాల కొరతను అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి, ఎంపీఓ ఖాజామెయినుద్దీన్, పంచాయతీ సెక్రటరీ కృష్ణయ్య, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సీఆర్‌పీఎఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం



ఎల్కూరుకు కూలీలను తరలిస్తున్న బొలెరో వాహనం



ప్రమాదకరంగా కూర్చొని ఉన్న కూలీలు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రైవేటు గూడ్స్ వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గట్టు, కేటీదొడ్డి, అయిజ మండలాల నుంచి నిత్యం మల్దకల్ మండలంలోని వివిధ గ్రామాలకు 10 నుంచి 30కు పైగా గూడ్స్ వాహనాల్లో కూలీలను చేరవేస్తున్నారు. ఒక్కో వాహనంలో 30 నుంచి 50 మంది కూలీలను చేరవేస్తుండడంతో చిన్నపాటి ప్రమాదం జరిగినా ప్రాణనష్టం జరిగే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రైవేటు గూడ్సు వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి

ఆత్మకూర్: భూభారతి చట్టం రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో వేగం పెంచాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. సదస్సులో వచ్చిన దరఖాస్తుల వివరాలను తహసీల్దార్ చాంద్‌పాషాను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్‌ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ఎర్రవల్లి: రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు బీచుపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని 12, 14 పోలింగ్ బూత్‌లో బూత్ బైటీక్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో సందర్శించి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి అవగాహన కల్పించాలన్నారు. అందులో భాగంగా ఉజ్వలయోజన, సుకన్యయోజన, విశ్వకర్మ యోజన, ఆయుష్మాన్ భారత్, జీవనజ్యోతి, జీవన్‌సురక్షిత్ పాలసీ, కిసాన్‌సమ్మాన్ యోజన, స్వచ్ఛ భారత్ వంటి పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ, మోహన్, నరేష్, అనిల్‌శర్మ, సుదాకర్, వీరేష్, బూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాత జాబితానే కొనసాగించాలి



రాజోళి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు పాత ఓటరు జాబితా ప్రకారమే నిర్వహించాలని జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు యువకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. 2009లో వరదల అనంతరం చాలా మంది కొత్త రాజోళిలో ఉన్నారని, ప్రస్తుతం కొత్త రాజోళిలోని 1, 2, 3, 4, 5 వార్డుల్లో నివాసముంటున్న వారిని పాతజాబితా ప్రకారం యధావిధిగా కొనసాగించాలన్నారు. లేని క్రమంలో పునరావాసంలో ప్రభుత్వం కేటాయించిన గృహాల వారీగా ఓటరు లిస్టు తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రంగన్న, పరుశరాములు, వీరేంద్ర, రాఘవేంద్ర తదిదరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



అమరచింత: పరిసరాలను పరిశుభ్రంగా ఉండుకోవడంతోనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా 8వ వార్డులో పరిసరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి చెత్త ట్రాక్టర్‌లో వేయాలన్నారు. వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యంతో దోమలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. పురపాలిక ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



ఆలయంలో బీజేపీ నేతలు

కేటిదొడ్డి: మండల పరిధిలోని పాతపాలెం శివాలయంలో బుధవారం నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శివలింగం, నంది, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలతో పాటుగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో బడి, గుడి తప్పని సరిగా ఉండాలన్నారు. దేవాలయాలు ఉండటం ద్వారానే భక్తి భావాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ నల్లహనుమంతు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, నాయకులు వెంకన్నగౌడ్, చంద్రశేఖర్, ఉరుకుందు, యుగంధర్‌గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్నిగ్ధారెడ్డి పూజలు..

విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ స్నిగ్ధారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు బీజేపీ నాయకులు ఆమెను సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా మాజీ అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, బల్గెర శివారెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ పాలనలో నానా అవస్థలు’



విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

అయిజ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే ఇవ్వాలని బీజేపీ నాయకులు బుధవారం మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో విద్యార్థులతో కలిసి రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. విద్యార్థుల పరిస్థితి మరీ ఘోరంగా మారిందన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు అపరిశుభ్రమైన ఆహారం ఇవ్వడంతో ఫుడ్‌పాయిజన్ జరిగి విద్యార్థులను ఆస్పత్రులకు తరలించాల్సి వస్తుందని మండిపడ్డారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యర్థులు చదువుకోవాలంటే భయపడుతున్నారన్నారు. విద్యార్థులకు వెంటనే స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వకుంటే బీజేపీ నాయకులు ప్రభుత్వంతో నేరుగా పోరాటానికి దిగుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, రాజశేఖర్, మహేష్, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుపై ప్రయాణమెలా?



ఇటిక్యాల సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ఇటిక్యాల: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిపై గుంతలు ఏర్పడటంతో నానా అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు, ప్రయాణికులు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి, మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారికి వెంటనే మరమ్మతు చేసి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



కొత్తపాలెంలో బోధన విధానాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: ఉపాధ్యాయులు సమయపాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల విద్యాధికారి రవీంద్రబాబు అన్నారు. బుధవారం ఉదయం ఆయన మండల పరిధిలోని కొత్తపాలెం, కొత్తపాలెం తండా ప్రాథమిక పాఠశాలల ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అదే విధంగా విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. 100 శాతం ఎఫ్‌ఆర్‌ఎస్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

భోజనం నాణ్యతగా ఉండాలి

కేటిదొడ్డి: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. యూపీఎస్ పాగుంట, వెంకటాపురం గ్రామాల్లోని పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రవి, శ్వేత, సీఆర్పీలు యుగంధర్, పాపయ్య పాల్గొన్నారు.